# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించారు.
- ❖ ఆంధ్రప్రదేశ్‌ను అమరావతి అధునాతనప్రదేశ్‌గా మార్చుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.
- ❖ రాజధాని అమరావతి రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లాలో సీనియర్ సిటిజన్ హోంను రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ వర్చువల్ విధానంలో ఈరోజు ప్రారంభించారు.
- ❖ గిరిజన నిరుద్యోగులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయం చేస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పునః నిర్మాణ పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించారు. దీనిలో భాగంగా అమరావతిలోని సుమారు 58 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. శాసనసభ, హైకోర్టు, సచివాలయం, ఇతర పరిపాలనా భవనాలు 5 వేల 200 కుటుంబాలకు 11 వేల 240 కోట్ల రూపాయలకు పైగా విలువైన గృహ భవనాలు వంటి బహుళ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అనుసంధానం చేసేందుకు ప్రధానమంత్రి 6 జాతీయ రహదారి ప్రాజెక్టులు, ఒక రైల్వే ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాగాయలంకలో దాదాపు 1,460 కోట్ల రూపాయల విలువైన క్షిపణి ప్రయోగ కేంద్రానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేసారు. ఇందులో దేశ రక్షణ సంసిద్ధతను పెంచే ప్రయోగ కేంద్రం, సాంకేతిక పరికరాల

సౌకర్యాలు, స్వదేశీ రాడార్లు, టెలిమెట్రీ, ఎలక్ట్రో-ఆప్టికల్ వ్యవస్థలు ఉన్నాయి. విశాఖపట్నంలోని మధురవాడలో "పీఎం ఏక్తా మాల్"కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. జాతీయ సమైక్యతను పెంపొందించడం, మేక్ ఇన్ ఇండియా చొరవకు మద్దతు ఇవ్వడం, వన్ డిస్ట్రిక్ట్... వన్ ప్రొడక్ట్‌ని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను కల్పించడం, గ్రామీణ కళాకారులకు సాధికారత కల్పించడం, స్వదేశీ ఉత్పత్తుల మార్కెట్ ఉనికిని పెంచడం అనే లక్ష్యంతో దీనిని రూపొందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలువురు మంత్రులు తదితరులు పాల్గొన్నారు

=======================

ఆంధ్రప్రదేశ్‌ను అమరావతి అధునాతనప్రదేశ్‌గా మార్చుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు అమరావతి పునఃనిర్మాణ సభలో తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రజల కలలను అమరావతి సాకారం చేస్తుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతమని పేర్కొన్నారు. వేగవంతంగా అమరావతి నిర్మాణాలు కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని నరేంద్రమోదీ పేర్కొంటూ....

(వాయిస్ 42 సెకన్లు)

దాపు 60 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశామని, ఇవి ఆంధ్రప్రదేశ్ ప్రగతికి, వికసిత్ భారత్‌కు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 70కు పైగా రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ల కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు. యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, జూన్ 21వ తేదీన రాష్ట్ర ప్రజలతో కలిసి యోగా దినోత్సవంలో పాల్గొంటానని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

=======================

అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతి పునః నిర్మాణ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూమిని రాజధానికి పూలింగ్ కింద ఇచ్చారన్నారు. అమరావతినే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2027 నాటికి పోలవరం పూర్తవుతుందని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమనశ్రయాన్ని వచ్చే సంవత్సరానికి పూర్తి చేస్తామని, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రానికి గూగుల్, టీసీఎస్ కంపెనీలు రాబోతున్నాయని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

అమరావతి ప్రపంచ స్థాయి సర్వశ్రేష్ఠ రాజధానిగా ఆవిర్భవిస్తుందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు. అమరావతి పునఃనిర్మాణం సభలో ఆయన మాట్లాడుతూ... అమరావతి రాష్ట్రానికే కాక.. దేశానికే తలమానికంగా నిలుస్తుందన్నారు. ధర్మయుద్ధంలో అమరావతి రైతులు విజయం సాధించారన్నారు. వారి త్యాగాలను మరిచిపోలేమని, రాజధాని నిర్మించి అమరావతి రైతుల రుణం తీర్చుకుంటామని అన్నారు.

=======================

వయోజనులు గతానికి వారదులు, భవిష్యత్ కు మార్గదర్శకులని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం జరిగిన 'ఏజింగ్ విత్ డిగ్నిటీ' కార్యక్రమానికి భారత రాష్ట్రపతి

హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన సీనియర్ సిటిజన్స్ హోమ్ ల వర్చువల్ ప్రారంభోత్సవంలో భాగంగా అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జి.భీమవరం గ్రామంలో సీనియర్ సిటిజన్ హోమ్ ను రాష్ట్రపతి వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ, తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని, వారి మార్గదర్శకత్వాన్ని విలువైనదిగా పరిగణించాలన్నారు. వయో వృద్ధుల అనుభవాలు, జ్ఞానం యువతరానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రాష్ట్రపతి పేర్కొన్నారు.

=========================

ఉద్యోగాల విషయంలో ఆదివాసీ గిరిజన యువత అధైర్యపడొద్దని.. ఎవరి మాటలు విని, నమ్మి మోసపోవద్దని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. అరుకులో ఆదివాసీ విద్యార్థుల బంద్‌పై మంత్రి సంధ్యారాణి స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలోనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని అన్నారు. 16 వేల 437 డీఎస్సీ పోస్టులలో 2 వేల 024 పోస్టులు గిరిజనులకే కేటాయించారని, ఇప్పుడు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేయమని డిమాండ్ చేయడం భావ్యం కాదని అన్నారు. జీవో నెం. 3ను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని, దాన్ని స్థానంలో ప్రత్యామ్నాయ జీవోను తీసుకువస్తామనే మాటకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గిరిజన నిరుద్యోగులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయంగా ఉంటుందని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు.

=========================

రాష్ట్రంలో రేపటి నుంచి జరిగే గ్రూప్-1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ -ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలోని 13 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 4 వేల 496 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు ప్రధాన పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్షల నిర్వహణను ఆయా జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షిస్తారని రాజబాబు వెల్లడించారు.

=========================

శ్రీశైలంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీమల్లికార్జున స్వామి, భ్రమరాంబిక అమ్మవార్లకు ఈరోజు స్వర్ణరథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.వేకువజామునే స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించి అనంతరం స్వర్ణరథోత్సవంలో ఆశీనులైన శ్రీస్వామి అమ్మవార్లకి అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేసి కర్పూర హారతులిచ్చారు.

=========================
=========================